క్లుప్తంగా

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

కంబాలచెరువు: గురుపౌర్ణమి సందర్భంగా లాలాచెరువు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. పందలపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, శాటిలైట్ సిటీ ఉపాధ్యాయులు మేకా సుసత్య రేఖ, లాలా చెరువు మున్సిపల్ స్కూల్ కు చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మోటూరి మంగారాణిలను ఎమ్మెల్సీ సోము వీర్రాజు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కందికొండ రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి ప్రోది తేజ, ఈగల్ సీఐ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంధకారాన్ని తొలగించే వెలుగే గురువు



శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

రాజమహేంద్రవరం సిటీ: అంధకారాన్ని తొలగించే వెలుగే గురువని జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడు పీవీఎస్ కృష్ణారావు అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ గురూజీ అందించిన సుదర్శన క్రియ ద్వారా ప్రతి రోజూ గంట పాటు ధ్యానం చేస్తే, ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం కృష్ణానగర్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఆధ్యాత్మికతకు మార్గదర్శకత్వం వహిస్తున్న రవిశంకర్ గురూజీ దివ్య ఆశీసులతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గురువులు జీవన యాత్రలో మార్గదర్శకులు కాబట్టి, వారి ఆశీస్సులతో జీవితం ఆనందంగా సాగుతుందన్నారు. అనంతరం నీలం వెంకట శ్రీనివాసరావు, పి.సరోజాలను సత్కరించారు. కార్యక్రమంలో డీడీసీ సభ్యులు మహేష్, దేవి ప్రసాద్, రమణ, వెంకటేశ్వరరావు, రేలంగి భాస్కరరావు, మన్యం శివరామకృష్ణ పాల్గొన్నారు.

శాకంబరిగా అపర్ణాదేవి



శాకంబరి అలంకరణలో అమ్మవారు

కడియం: కడియపులంక హరిహర మహాక్షేత్రంలో కొలువైన అపర్ణాదేవి గురువారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

బీఎల్ఓలకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణ నాయక్

రాజానగరం: భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి నియోజకవర్గంలోని బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్ఓ) గురువారం శిక్షణ తరగతులు మొదలయ్యాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు రోజుల పాటు ఐదు బ్యాచ్‌లలో 250 మంది బీఎల్ఓలకు శిక్షణ ఇవ్వనున్నారు.

సినిమాలు

శ్యామల	: ఓ భామ అయ్యో రామ
సూర్యమినీ	: ఎఫ్1దిమూవీ, 3బీహెచ్‌కే
సూర్యప్యాలెస్	: జురాసిక్‌వరల్డ్, ద 100
స్వామి	: కుబేర
అనుశ్రీ	: సూపర్‌మేన్
శివజ్యోతి	: వర్జిన్ బాయ్స్
రాజా	: సూపర్‌మేన్
ఊర్వశి	: మిరపకాయ్, కుమారి 21ఎఫ్
మేనక	: జురాసిక్ వరల్డ్
రంభ	: మార్గన్
అప్సర	: సూపర్‌మేన్
అశోక	: సూపర్‌మేన్
నామవరం	
వీఎస్ మహల్	: సూపర్‌మేన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: సూపర్‌మేన్
కడియం	
వెంకటసూర్య	: సూపర్‌మేన్

ఇదేమిటి గురువులూ..

- కార్పొరేట్ స్కూళ్లపై ఉపాధ్యాయుల ఆసక్తి
- తమ పిల్లలకు అక్కడే చదువులు
- ప్రభుత్వ స్కూళ్లలో చేర్పని వైనం
- ఒకరిద్దరు తప్ప అందరూ ఆ బాటలోనే..



ప్రభుత్వ పాఠశాలలో తన కుమార్తెకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

కంబాలచెరువు: ప్రస్తుతం ఎక్కడ చూసినా కార్పొరేటు, ప్రైవేటు స్కూళ్ల హవా నడుస్తోంది. నగరాలు, గ్రామాలు అనే తేడా లేకుండా అన్నిచోట్ల వివిధ రకాల ప్రైవేటు పాఠశాలలు ఏర్పాటవుతున్నాయి. సామాన్య ప్రజలు కూడా తమ పిల్లలను వాటిలోనే చేర్పడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇది అందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ.. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సైతం తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్ల చదివించడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అక్కడక్కడా ఒకరిద్దరు టీచర్లు తమ పిల్లలను సర్కారీ స్కూళ్లకు పంపిస్తున్నప్పటికీ దాదాపు అందరూ ప్రైవేటు స్కూళ్ల బాట పడుతున్నారు.

వేలల్లో ఫీజులైనా..

ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న చాలా మంది గురువులు తమ పిల్లలు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలోనే చదువుకోవాలనే ఆలోచనతో ఉంటున్నారు. వేలకు వేల రూపాయలు ఫీజు కట్టడానికి కూడా సిద్ధమవుతున్నారు. తాము పనిచేస్తున్న పాఠశాలల్లో చాలా మంది పిల్లలకు విద్యాబుద్ధులు చెబుతున్నారు. కానీ సొంత పిల్లలను మాత్రం ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. దీనిపై చాలామంది తల్లిదండ్రులు విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల గొప్పదనాన్ని ప్రజలకు వివరించే ఉపాధ్యాయుల్లో చాలా మంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నవారే కావడం గమనార్హం.

నగరంలో 83 పాఠశాలలు

రాజమహేంద్రవరంలో ఒకటి నుంచి 10వ తరగతి వరకూ చదువు చెప్పే ప్రభుత్వ స్కూళ్లు సుమారు 83 వరకూ ఉన్నాయి. వీటిలో దాదాపు 600 మంది పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో 90 శాతానికి పైగా ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చదివించడం లేదు. గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ బలోపేతమైంది. ఆయన తీసుకువచ్చిన నాడు – నేడు పథకంలో స్కూళ్ల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. బెంచీలు, బ్లాక్ బోర్డులు, తాగు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు సమకూరాయి. పిల్లలకు బ్యాగులు, పుస్తకాలు, షూలు, సాక్సులు, యూనిఫాం ఇచ్చి, ఒక కార్పొరేట్ స్కూల్ విద్యార్థి మాదిరిగా తయారు చేశారు.

ప్రతిభకు లోటు లేదు

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగంలో చేరతారు. దాని కోసం ఎంతో కష్టపడతారు. అన్ని సబ్జెక్టులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉంటారు. ఏ విషయాన్నైనా పిల్లలకు చక్కగా చెప్పగలుగుతారు. వారిలో ప్రతిభకు ఏమాత్రం లోటు ఉండదు. ఏడాదిలో పలుమార్లు విద్యాశాఖ నిర్వహించే పలు శిక్షణలు, విద్యాబోధనలో మెళకువలు నేర్చుకుంటారు. విద్యాబోధనలో ఆరితేరి ఉంటారు. పాఠశాలలో పిల్లలకు అర్థమయ్యేలా బోధన చేస్తారు. కానీ చాలామంది తమ పిల్లలను మాత్రం ప్రభుత్వ పాఠశాలలకు పంపించరు. అదే కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఉపాధ్యాయులుగా పనిచేస్తారు.

ఆదర్శప్రాయులు

నగరంలోని మున్సిపల్ స్కూళ్లలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న దాసరి శివసత్యమూర్తి, చింతపల్లి శ్రీనివాస్ మాత్రం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు. ఆ విషయంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ పిల్లలకు కూడా చక్కగా చదువుకుని, ఏటా మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతున్నారు.

అందరూ అనుసరించాలి



తాము విద్యాబోధన చేస్తున్న పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించాలని ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తున్న ఉపాధ్యాయులను మిగిలిన వారు ఆదర్శంగా తీసుకోవాలి. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై అందరికీ ఒక మంచి నమ్మకం వస్తుంది. ఆ దిశగా అందరూ పనిచేయాలి.

– వరణ జగన్నాథరావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రాజమహేంద్రవరం.

తొర్రేడు సొసైటీ చైర్ పర్సన్‌గా బాపినీడు



బాపినీడుకు నియామక పత్రం అందజేస్తున్న సొసైటీ సీఈవో సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ చైర్ పర్సన్ దండమూడి బాపినీడు, పర్సన్లుగా నల్లూరి రామకృష్ణ, విన్నకోట శేషాచార్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వీరితో సంఘ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేవీవీ సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రం అందజేశారు. మాజీ సొసైటీ అధ్యక్షులు చిట్టూరి వెంకటరావు, చిట్టూరి మోహన్ గాంధీ, మద్దుకూరి అచ్యుత రామారావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వారాహి మాతకు గంధంతో అభిషేకం

- ముగిసిన గుప్త నవరాత్రులు
- చివరి రోజు తరలివచ్చిన ప్రముఖులు, భక్తులు



శ్రీమహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు

సీటీఆర్ఐ: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గాడాల గ్రామంలోని మహాలక్ష్మి సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో నిర్వహించిన వారాహి గుప్త నవరాత్రులు గురువారంతో ముగిశాయి. పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు ఆధ్వర్యంలో జూన్ 26న ఈ ఉత్సవాలు మొదలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మహాలక్ష్మిని వారాహి అమ్మవారిగా అలంకరించి, గుప్త నవరాత్రుల్లో పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చివరి రోజు గురువారం ఉదయం 108 కిలోల గంధంతో అభిషేకం నిర్వహించి, హారతి ఇచ్చారు. అనంతరం అమ్మవారు యథాతథంగా మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మన గుడి – మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ మాట్లాడుతూ గంధపు బిళ్లలను భక్తులకు వితరణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి
- పాఠశాలలో మెగా పీటీఎం సమావేశాలు



మెగా పేటీఎం సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



డ్రీమ్స్ విద్యార్థిని సాయిసుప్రియకు బహుమతి అందజేస్తున్న ధర్మరాజు, పురాణం శ్రీనివాస్

కంబాలచెరువు: విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా, చదువుపై దృష్టి సారించాలని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి అన్నారు. ఆర్యాపురంలోని నన్నయ్య నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారుతున్నారన్నారు. దీనివల్ల వారి భవిష్యత్తు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

- 38వ వార్డులోని టౌన్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజర్యారు. అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, 38వ వార్డు ఇన్‌చార్జ్ బుడ్డిగ రవి, గోపాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.సూరిబాబు, ఉపాధ్యాయులు

ధవళేశ్వరం: గ్రామంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ధవళేశ్వరం జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి డీఎస్పీ భవ్య కిశోర్, టీడీపీ నాయకుడు గోరంట్ల రవికిరణ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

- ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ది ఆర్యాపురం కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ యర్రమోతు ధర్మరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. 10వ తరగతి పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరచి 589 మార్కులు సాధించిన సముద్రాల సాయిసుప్రియకు యర్రమోతు ధర్మరాజు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పురాణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి



రామకృష్ణ మఠంలో రామకృష్ణ పరమహంస విగ్రహానికి ప్రత్యేక పూజలు



దుళ్లలో బాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



కడియపులంకలో అన్నసమారాధన

సీటీఆర్ఐ: నగరంలోని పలు ఆలయాల్లో గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. గోదావరి గట్టున ఉన్న శృంగేరీ శంకర మఠంలో గురపాదుకార్చన, చంద్రమౌళీశ్వరునికి అభిషేకాలు, శారదాదేవికి విశేష అర్చనలు నిర్వహించారు. శ్రీరామకృష్ణ మఠంలో ఉదయం ఐదుగంటల నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణునికి విశేష పూజలు నిర్వహించి, సామూహిక పారాయణ చేశారు. ఎంపీ పురందేశ్వరిని శాలువాతో సత్కరించి రాధాకృష్ణుల చిత్రపటాన్ని అందించారు.

ప్రత్యేక పూజలు

కడియం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో గల షిర్డీ సాయిబాబా మందిరాలకు గురువారం భక్తులు పోటెత్తారు. కడియం, వేమగిరి, కడియపులంక, వీరవరం, మురమండ, దుళ్ల గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తుల సాయినామ సంకీర్తనలు, ఆధ్యాత్మిక భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. పలు చోట్ల భక్తులు, దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయాల కమిటీలు పర్యవేక్షించాయి.

అల్లు బాబీకి మాతృ వియోగం



అల్లు రాజేశ్వరి (ఫైల్)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లు బాబీ మాతృమూర్తి, రాజమహేంద్రవరం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అల్లు రాజేశ్వరి (85) బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అల్లు బాబీ ఆమెకు పెద్ద కుమారుడు. చిన్న కుమారుడు ప్రసాద్ హైదరాబాద్‌లో ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ ధర్మకర్తగా ఉన్నారు. రాజేశ్వరి కాంగ్రెస్‌లో చురుకైన పాత్ర పోషించారు. 1987లో మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై నగర అభివృద్ధికి కృషి చేశారు. రాజేశ్వరి అంత్యక్రియలను కోటిలింగాలరేవులో గురువారం సాయంత్రం నిర్వహించారు. ఆమె భౌతిక కాయాన్ని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిలపర్తి శ్రీనివాస్, నగర ప్రముఖులు, మాజీ కార్పొరేటర్లు, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా చేప రైతుల దినోత్సవం

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయ చేప రైతుల దినోత్సవం నిర్వహించారు. దీనికి హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన, అనుభవజ్ఞులైన చేప రైతుల నుంచి నేర్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు ప్రాయోగిక విద్యా పద్ధతులను అనుసరించి నైపుణ్యం పొందాలన్నారు. భారత ఆహార భద్రతను బలోపేతం చేయడంలో, చేపల ఆధారిత ప్రోటీన్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో, గ్రామీణ ఉపాధిని పెంపొందించడంలో చేప రైతుల పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్ ప్రదర్శనలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ పర్సన్ ఇన్‌చార్జిగా బొప్పన శ్రీనివాసరావు, పర్సన్లుగా సోము వినాయక్, మద్దిపోటి సత్యనారాయణ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘ పరిధిలోని కూటమి నాయకులు, రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జీపీఆర్ కాలనీలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ రూరల్ మండల–3 అధ్యక్షుడు షేక్ సాజిద్, రూరల్ అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు, పార్టీ నేతలు గురువారం రాజమండ్రి ఎస్ఈ కార్యాలయంలో ఏఈ గీతాభవానికి వినతిపత్రం అందజేశారు. భారతీయ జనతా పార్టీ గ్రామ పర్యటనలో భాగంగా బొమ్మూరు గ్రామంలోని జీపీఆర్ కాలనీ ప్రాంతంలో పర్యటించామన్నారు. అక్కడ విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో స్థానికులు బాధపడుతున్నారన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తి అవగాహన కలిగి, మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య అన్నారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బి.విద్య మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌లు, లింకులు, ఇ–మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అనవసర లింక్‌లను క్లిక్ చేయడంతో కలిగే అనర్థాలు, నష్టాలను వివరించారు. గుర్తు తెలియని, అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్, చాటింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది వైవీ సురేష్, పి.దుర్గాప్రసాద్, అబ్దుల్ షౌకత్ పాల్గొన్నారు.

కోనేరు మురళికి పలువురి పరామర్శ



వెంకట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మార్గాని భరత్‌రామ్ తదితరులు



వెంకట్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి రాజా తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పుత్ర వియోగంతో బాధపడుతున్న నగర ప్రముఖుడు కోనేరు మురళిని గురువారం పలువురు పరామర్శించారు. ఇటీవల ఆయన కుమారుడు కోనేరు సుష్మంత్ వెంకట్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుష్మంత్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎంపీలు మార్గాని భరత్‌రామ్, ఉండవల్లి అరుణ్ కుమార్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, ముప్పిడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్, రుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, ముళ్లపూడి బాపిరాజు, నల్లం చక్రధరరావు, జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, భాస్కర చౌదరి తదితరులు మురళిని పరామర్శించారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాలు

- 10 నుంచి 17 వరకూ వారోత్సవాలు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



వారోత్సవాల పోస్టర్ విడుదల చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: మధ్యవర్తిత్వం ద్వారా శాంతియుత పరిష్కారాలకు ప్రాధాన్యం ఇస్తూ, కేసుల పరిష్కారమయ్యే దిశలో 86 మంది న్యాయవాదులకు 40 గంటల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో 'దేశం కోసం మధ్యవర్తిత్వం' వారోత్సవాల పోస్టర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయసేవాసదన్‌లో స్థాపించిన మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా ప్రజలు తమ వివాదాలను శాంతియుతంగా, తక్కువ ఖర్చుతో, త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కార మార్గం, అవార్డుల జారీ చేయడంలో న్యాయవాదులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. అప్పులు, ఆస్తి సంబంధిత సమస్య లకు చట్టబద్ధ పరిష్కారం, ప్రజల మధ్య ఉన్న పునరావృత వివాదాలు, భూమి తగాదాలు, పౌర సాక్ష్యాలు వంటి అనేక అంశాల్లో మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యపూరిత పరిష్కారాలు సాధ్యమవుతాయన్నారు. వాటికి తదుపరి హైకోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం ఉండదన్నారు. రాజీ అంటే ఇద్దరి గెలుపు అన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మధ్యవర్తిత్వంపై న్యాయవాదులలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీనికి తమిళనాడుకు చెందిన మాస్టర్ ట్రైనర్స్ ద్వారా ఏడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించనున్నామన్నారు. జిల్లా న్యాయ సేవాసదన్ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వ కేంద్రం ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు వై.బేన్నైనాయుడు, ఎం.మాధురి, ఎస్.ఉమా సునంద, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్కే జానీబాషా, బి.పద్మ, కె.ప్రకాష్‌బాబు, ఎస్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోకల్వర్టుపై రాకపోకలకు మార్గం సిద్ధం

సీతానగరం: చీపురుపల్లి – చినకొండేపూడి రోడ్డులోని అప్పన్న చావిడి వద్ద గల లోకల్వర్టుకు తాత్కాలికంగా తూరలు ఏర్పాటు చేశారు. ఈ కల్వర్టుపై నుంచి క్వారీ లారీలు రాకపోకలు సాగించడంతో తూరలు పగిలి, మూసుకుపోయాయి. దీంతో ముంపు నీరు ముందుకు వెళ్లే మార్గం మూసుకుపోయింది. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చినకొండేపూడి గ్రామాలతో పాటు పంట పొలాల నుంచి నీరు తరలివెళ్లే మార్గం ఇదే కావడంతో రైతులు ఆందోళన చెందారు. దీనిపై సాక్షి పత్రికలో వరస కథనాలు వచ్చాయి. వైఎస్సార్ సీపీ ఎంప్లాయాస్, పెన్షనర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు ఆధ్వర్యంలో రైతులతో కలసి ఆందోళన చేశారు. జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ కూడా ఫిర్యాదు చేశారు. దీంతో తొమ్మిది సిమెంట్ తూరలు తీసుకువచ్చి, వాటిని మూడు వరసలుగా వేసి, లోకల్వర్టుపై మార్గం ఏర్పాటు చేశారు. దీని వల్ల రాకపోకలకు, ముంపు నీటి ప్రవాహానికి మార్గం ఏర్పడింది. అయితే రోడ్డు మార్గంలో గ్రావెల్ వేయాలని, లేకుంటే వాహనాలు జారి పడే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.